సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



గురుకులంలో క్రీడా కుసుమాలు
అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా, జోనల్, రాష్ట్ర క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థులు రాణిస్తున్నారు. 8లో



ప్రమాద బాధితులకు పరామర్శ
గంగవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను డీఎంహెచ్‌వో పరామర్శించారు. 8లో



లారీ ఢీకొని యువకుడి మృతి
చింతూరు మండలం కొత్తూరు వద్ద హైవేపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. 8లో

న్యూస్‌రీల్

కోర్టు కేసుల విచారణ వాయిదా

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏలో ఈనెల 10న నిర్వహించనున్న కోర్టు కేసుల విచారణను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు కేసులు ఎప్పుడు విచారణ నిర్వహిస్తామనేది కక్షిదారులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. శుక్రవారం కోర్టు కేసుల నిమిత్తం పాడేరు ఐటీడీఏకు ఎవ్వరు రావొద్దని ఆయన సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఆరుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

చింతూరు: ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఆరుగురిని బుధవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తారసపడిన రెండు కార్లను పరిశీలించారు. వాటిలో 50 కిలోల గంజాయి లభ్యమైనట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. గంజాయిని ఒడిశా నుంచి తమిళనాడుకు తరలిస్తున్నారని విచారణలో వెల్లడైందని ఆయన తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన విజయ్‌కుమార్, రంజిత్, సుబ్రమణ్యం, రాజా, విజయ్‌కన్నన్, ఒడిశాకు చెందిన హరిదాస్ సర్కార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన గంజాయికి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించారు.

'అన్నవరం' పాలకమండలి సభ్యురాలిగా పూజ

- ఎమ్మెల్యే ధనలక్ష్మికి సత్కారం



ఎమ్మెల్యే ధనలక్ష్మిని సత్కరిస్తున్న పూజ, పార్టీ నాయకులు

రంపచోడవరం: అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా కారుకోడి పూజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యురాలిగా మరో సారి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని బుధవారం ఆమె సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్న దొర, వైస్ ఎంపీపీ పండాకుమారి, ఎంపీటీసీ ఉలవల్ల లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ పాలోజికాంతం, పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు, మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, ఐ పోలవరం సచివాలయ కన్వీనర్ కుంజం రామకృష్ణ దొర, రంపచోడవరం సచివాలయ కన్వీనర్ తుపాటి రాజారావు(కొండరాజు), కై గాల అనిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ ఏజెన్సీలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

- సినీ గాయకుడు, రచయిత జయరాజు



మాట్లాడుతున్న గాయకుడు జయరాజు

చింతూరు: షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని సినీ గాయకుడు, రచయిత జయరాజు కోరారు. మండలంలోని రామన్నపాలెంలో కోయత్తోర్‌బాట ఆధ్వర్యంలో జరుగుతున్న కోయ బాలసాహిత్య సెమినార్‌లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జానపదాలు, పద్యాలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఆదివాసీలు ప్రకృతి ఆరాధకులని, భూమి, అడవి, నీటికి ఎంతో ప్రాముఖ్యత ఇస్తారని ఆయన తెలిపారు. బాలసాహిత్యం రాబోయే తరానికి పునాదిగా మారి ఆదివాసీల అభివృద్ధికి మరింత దోహద పడుతుందన్నారు. ఆదివాసీ కళాకారులను తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని జయరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సురేందర్‌రాజు, కవి మోహన్‌రుషి, కోయత్తోర్ బాట నిర్వాహకులు దుమ్మిరి భీమమ్మ, సోడె మురళి, కుంజా రామారావు, పాదయ్య, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

వెల్లువలా

పెట్టుబడులు రూ.1.17 లక్షల కోట్లు

ఉద్యోగాలు 81,450

గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా.. డేటా సెంటర్ హబ్‌గా ఉమ్మడి విశాఖ

- పూడిమడకలో రూ.1.10 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు
- 61 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్న ఎన్‌టీపీసీ
- కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- 20,450 మందికి ఉపాధి అవకాశాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో కీలక ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. ఐటీ హబ్‌గా పర్యాటక డెస్టినీగా భాసిల్లుతున్న వైజాగ్.. ఇప్పుడు డేటా సెంటర్‌కు ప్రధాన కేంద్రంగానూ, గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్‌గా మారనుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల పెట్టుబడితో 61 వేల మందికి ఉపాధి కల్పించేలా ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా రూ.7,210 కోట్ల పెట్టుబడితో 20 వేల పై చిలుకు ఉద్యోగాలు కల్పించేలా డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఉమ్మడి విశాఖ చరిత్రలో ఒకేసారి రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులు, 80 వేలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

కీలక ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖపట్నం మారుతోంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టిసారించిన రాష్ట్ర ప్రభుత్వం.. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో నగరంలో పెట్టుబడులకు, భారీ ప్రాజెక్టులకు ఉన్న అవకాశాల్ని అందిపుచ్చుకుంటూ ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రెండ్రోజుల క్రితం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్‌ఐపీబీ) సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు ఎస్‌ఐపీబీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ఇందులో సింహభాగం విశాఖకే చెందినవి కావడం గమనార్హం. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏకంగా రూ.1,17,210 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో విశాఖ జిల్లా పారిశ్రామిక రంగంలో సరికొత్త విభాగాలకు కేంద్ర బిందువుగా మారుతోంది.

గ్రీన్ ఎనర్జీ కేరాఫ్ పూడిమడక

దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు అచ్యుతాపురం మండలంలోని పూడిమడక చిరునామాగా మారనుంది. ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా లక్షా 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో న్యూ ఎనర్జీ పార్కు నిర్మించనుంది. ఈ పార్కులో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్, హైడ్రోజన్ సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయి. ఇంధన రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కొత్త తరహాలో ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రణాళికలు తయారు చేసింది. రెండు దశల్లో పూర్తి చేసే ఈ ప్రాజెక్టు ద్వారా 61 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రానున్నాయి.



ప్రాజెక్టు పేరు : ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ పార్కు
పెట్టుబడి : రూ.1,10,000 కోట్లు
విస్తీర్ణం : సుమారు 1000 ఎకరాలు
ఉపాధి అవకాశాలు : 61 వేల మందికి
మొదటి దశ : రూ.55 వేల కోట్లు, 30 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2027
రెండోదశ : రూ.55 వేల కోట్లు, 31 వేల మందికి ఉపాధి అవకాశాలు
పూర్తి చేసే సమయం : 2033

కాపులుప్పాడలో డేటా సెంటర్

మధురవాడ ఐటీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే అదానీ డేటా సెంటర్‌కు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన విషయం విదితమే. రూ.14,634 కోట్ల పెట్టుబడులతో 200 మెగావాట్ల సామర్థ్యంతో డేటాపార్క్ రాబోతోంది. తాజాగా 100 మెగావాట్ల సామర్థ్యంతో మరో డేటా సెంటర్ దాని సమీపంలోని కాపులుప్పాడ ప్రాంతంలో ఏర్పాటుకు ఎస్‌ఐపీబీ పచ్చజెండా ఊపింది. వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ సంస్థ ఈ డేటా సెంటర్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రూ.7,210 కోట్ల పెట్టుబడులతో 20,450 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలని సంకల్పించారు. మొత్తంగా ఈ రెండు ప్రాజెక్టులూ పూర్తయితే విశాఖ నగరం ఆంధ్రప్రదేశ్‌కు డేటా సెంటర్ హబ్‌గా మారనుంది.



ప్రాజెక్టు పేరు : డేటా సెంటర్
ఎవరి ఆధ్వర్యంలో : వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్
పెట్టుబడి : రూ.7,210 కోట్లు
ఉపాధి అవకాశాలు : 20,450 మందికి
ప్రత్యక్షంగా : 14,825 మందికి
పరోక్షంగా ఉపాధి : 5,625 మందికి
ప్రాజెక్టు పూర్తయ్యేది : 2026
మొదటి దశలో.. : 10 మెగావాట్లు
రెండో దశలో : 40 మెగావాట్లు
మూడో దశలో : 50 మెగావాట్లు

ఏప్రిల్ 3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

అడ్డతీగల: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి జరుగుతాయని రాయపల్లి ఎ-1 కోఆర్డినేటర్ సీహెచ్.చిన్నిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయింత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 3వ తేదీన టెన్త్ తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, ఇంటర్ హిందీ, తెలుగు, ఉర్దూ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయన్నారు. 6వతేదీన టెన్త్ హిందీ, ఇంటర్ జీవశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, వ్యాపారశాస్త్రం, గృహ విజ్ఞానశాస్త్రం, 8వ తేదీన టెన్త్, ఇంటర్‌కు కూడా ఇంగ్లీషు సబ్జెక్ట్ పరీక్ష ఉంటుందని తెలిపారు. 10వ తేదీన టెన్త్ గణితం, భారతీయ సంస్కృతి వారసత్వం, ఇంటర్ గణితం, చరిత్ర, వ్యాపార గణాంకశాస్త్రం,13వ తేదీన టెన్త్ శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం, ఇంటర్ భౌతికశాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌర శాస్త్రం, మనో విజ్ఞానశాస్త్రం పరీక్ష జరుగుతుందన్నారు. 15వ తేదీన టెన్త్ సాంఘికశాస్త్రం, ఆర్థికశాస్త్రం, ఇంటర్ రసాయన శాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం ,17వ తేదీన టెన్త్ బిజినెస్ స్టడీస్, మనో విజ్ఞానశాస్త్రం , వృత్తి విద్య, ఇంటర్ అన్ని వృత్తి విద్య సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సార్వత్రిక విద్యాపీఠం అమరావతి నుంచి ఇప్పటికే టైం టేబుల్ విడుదల అయిందన్నారు. విద్యార్థులు ఇందుకు అనుగుణంగా చదువుకుని పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు.

ఐటీడీఏ ఖాళీ స్థలానికి కంచె



ఐటీడీఏ ప్రహరీని ఆనుకొని ఏర్పాటుచేసిన కంచె

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ ప్రహరీని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఇనుపతీగలతో కంచెను బుధవారం ఏర్పాటు చేశారు. ఐటీడీఏ ప్రవేశద్వారం రోడ్డులో ఉన్న ఈ స్థలంలో ప్రజాసంఘాలు చాలా సందర్భాల్లో ధర్నాలు, ఆందోళనలు, రిలే దీక్షలు చేపట్టేవారు. రోడ్డు పక్కన స్థలం కావడంతో ఆందోళనలతో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తేవి. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇక్కడ కంచెను ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేశారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యం




మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాల్గొన్న వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు..

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- అనంతగిరిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' నిర్వహణ

అనంతగిరి: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పనిచేయాలని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు నియోజకవర్గ పరిశీలకుడు కొండపల్లి కొండబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన «మా నమ్మకం నువ్వే జగనన్న» కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మళ్లీ రాష్ట్రముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని ప్రతి ఒక్కరిలోనా తపన ఉందన్నారు. అందుకు అనుగుణంగా మనమంతా కష్టపడి పనిచేస్తే ప్రతిఫలం దక్కుతుందన్నారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో సైకిల్ పోవాలని వారే కోరుకుంటున్నారన్నారు. వారి చేష్టలతో ఈసారి టీడీపీ పార్టీకి పుట్టగతులు ఉండవన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు కళ్లు అని పేర్కొన్నారు. ప్రతి గడపలో పథకాలపై వివరించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కొండపల్లి కొండబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. విజయమే లక్ష్యమని, అందుకు వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు అహర్నిశలు శ్రమిస్తే సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, ఎంపీటీసీలు తౌటినాయుడు, శ్రావణి, జయవర్ధిని, సర్పంచ్‌లు పాగి అప్పారావు, సీతయ్య, అన్నపూర్ణ, గణేష్, పెంటమ్మ, సింహాద్రి, మజ్జి అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి డానియేలు, మండల యూత్ కార్యదర్శి రవి, కన్వీనర్ నవీన్, నాయకులు స్వామి, సోషల్‌మీడియా కన్వీనర్ పాగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అరకు అభివృద్ధికి కేంద్రం నిధులివ్వాలి

- లోక్‌సభలో అరకు ఎంపీ మాధవి



కొయ్యూరు : అరకు పార్లమెంటు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు మరింతగా నిధులు ఇవ్వాలని, కేంద్రం అనేక విషయాలకు సంబంధించి నిధులు విడుదల చేయాలని ఎంపీ గొడ్డేటి మాధవి కేంద్రాన్ని కోరారు. ఆమె రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యావాదాలు తెలిపే సందర్భంగా లోక్‌సభలో బుధవారం ప్రసంగించారు. గిరిజన బిడ్డగా రాష్ట్రపతి ముర్ము పార్లమెంట్‌లో ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడడం ఆనందంగా ఉందని అన్నారు. అలాగే గిరిజన స్వతంత్ర సమరయోధుడు బిర్సముండా జయంతిని జన జాతీయ దివస్‌గా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామాల కింద దేశంలో 36 వేల గ్రామాలకు మౌలికవసతులు కల్పిస్తున్నారని తెలిపారు. దేశంలో 400లకు పైగా ఏకలవ్య పాఠశాలలున్నాయని, మూడువేలకు పైగా వన్‌ధన్ వికాస కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు.

సైనికుల్లా పనిచేయండి




మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, హాజరైన గ్రామ వలంటీర్లు,గృహ సారథులు,కన్వీనర్లు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు
- అన్నవరంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' నిర్వహణ

చింతపల్లి రూరల్: సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్న గ్రామ వలంటీర్లు, గృహ సారథులు,కన్వీనర్లు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు అన్నారు. బుధవారం మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలో «మా నమ్మకం నువ్వే జగనన్న» కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయలేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు అందించడంలో గ్రామ వలంటీర్లు, ప్రధానంగా పని చేస్తున్నారన్నారు. వీరికి తోడుగా గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. గిరిజన ప్రాంతంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని విషయాన్ని గృహ సారథులు ఇంటింటికి వెళ్లి తెలుసుకుని సంక్షేమ పథకాలు అందుతున్న వారిని గుర్తించాలని ఆమె సూచించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపు ఖాయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, ఎంపీపీ కోరాబు అనూషా దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, తమ్మంగుల సర్పంచ్ లక్ష్మయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీటీసీలు బాబూరావు, మీనాకుమారి పాల్గొన్నారు.

ఐసీటీసీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ జేడీ

సాక్షి,పాడేరు: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. హెచ్‌ఐవీ సెంటినల్ సర్వైలెన్స్, ఐసీటీసీ విభాగాల పనితీరును సమీక్షించారు. రోజువారీ రోగుల పరీక్షలు,అందించిన వైద్యం ,ఆయా కేసుల రికార్డులను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణారావు, మైక్రోబయాలజిస్టు డాక్టర్ రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఆస్పత్రి సందర్శన

చింతపల్లి రూరల్: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ బుధవారం స్థానిక ప్రాంతీయ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రాన్ని పరిశీలించారు. సేవల వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కీర్తితో పలు అంశాలపై చర్చించారు.కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ బద్రి, ఎల్‌టీ అనిల్ పాల్గొన్నారు.



పాడేరులోని ఐసీటీసీ రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర్‌ప్రసాద్

ఫీడర్ అంబులెన్సుల తనిఖీ

అనంతగిరి: పాడేరు డివిజన్ పరిధిలోని 42 ఫీడర్ అంబులెన్సులను ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా జి.మాడుగుల, పాడేరు, అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లోని ఫీడర్ అంబులెన్సులను పరిశీలించారు. వీటి ద్వారా అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.ఈఎంటీలకు పలు సూచనలు చేశారు.రోజుకు నాలుగు కేసులకు తప్పనిసరిగా సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఫీడర్ అంబులెన్స్ సేవలు మరింత మెరుగుకు కృషిచేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. 2018–22 వరకు 9,28,012 కేసులకు 122 ఫీడర్ అంబులెన్సుల ద్వారా సేవలు అందించామన్నారు.



ఫీడర్ అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ప్రోగ్రామ్ మేనేజర్

జెన్‌కో ఈఈ జాకీర్ హుస్సేన్ బదిలీ

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాకీర్‌హుస్సేన్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కల్యాణమండపంలో ఇంచార్జ్ ఎండీ బాబూరావు తదితరులు హుస్సేన్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నరేళ్ల సర్వీసులో హుస్సేన్ పలువురి మన్ననలు పొందారన్నారు. జెన్‌కో అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే ప్రతి ఉద్యోగి ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సురేష్, ఏడీ అప్పలనాయుడు, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఈఈ జాకీర్ హుస్సేన్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

13 నుంచి టెక్నోప్రెన్యూర్‌షిప్‌పై శిక్షణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజ్(ఎన్‌ఐ-ఎంఎస్‌ఎంఈ) సంయుక్తంగా ఈ నెల 13 నుంచి ఆరు రోజుల పాటు అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాయి. సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై టెక్నో ప్రెన్యూర్‌షిప్ నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డిగ్రీ విద్యార్హత కలిగిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్‌లు ఈ శిక్షణ తరగతులకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా 95992 29217 నంబర్‌లో సంప్రదించవచ్చు. ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, డాక్టర్ అనింధ్య రాయ్ చౌదరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వణికిస్తున్న చలిగాలులు

- ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు
- ఆలస్యంగా సూర్యోదయం



పాడేరులో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రాత్రి ఏడు గంటల నుంచి చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం10గంటల తర్వాత పొగమంచు వీడింది. సూర్యోదయం ఆలస్యమైంది. మంగళవారంతో పోల్చుకుంటే ఉష్ణోగ్రతలు పెరిగాయి. మినుములూరులో 12 డిగ్రీలు, చింతపల్లిలో 12.5 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 13.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రమాద బాధితులకు పరామర్శ



గలగండ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని జిల్లా ఆస్పత్రిలో పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా



ఎస్‌ఎన్‌సీయూ సెంటర్‌లో చికిత్స పొందుతున్న శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

పెదబయలు: మండలంలోని గలగండ గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని 108 వాహనం ద్వారా పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సి జమాల్ బాషా తెలిపారు. జిల్లా ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అత్యవసర మెరుగైన వైద్యం అందించాలని, మెరుగైన వైద్యం కేజీహెచ్‌కు తరలించాలని సూపరింటెండెంట్ డా. కె.కృష్ణారావును ఆదేశించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను సందర్శించారు. రోజు వారిగా చికిత్స అందిస్తున్న కేసుల వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి ప్రసూతి విభాగం సమీపంలో శిశువును వదిలి వెళ్లిన విషయాన్ని తెలుసుకుని ఎస్.ఎన్.సి.యూ పాడేరు వద్దకు వెళ్లి వైద్యుల పర్యవేక్షణలో ఉన్న శిశువు ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన అనంతరం సంరక్షణ కోసం శిశు సంక్షేమ శాఖ అధికారికి అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి పాడేరు అదనపు జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లీలాప్రసాద్, ఆస్పత్రి సూపరింటెంట్ కృష్ణారావు, వైద్యాధికారులు పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, జిల్లా టీబీ పర్యవేక్షకులు వి. కిరణ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు మాట్లాడుతూ శిబిరంలో 20 మంది రక్తదానం చేసినట్టు తెలిపారు. వివిధ మండలాల్లో ఇప్పటి వరకు 15 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని, 600 మంది రక్తదానం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 బ్లడ్‌బ్యాంకులు ఉన్నట్టు చెప్పారు. వై. రామవరం, దేవీపట్నం, చింతూరులలో కూడా త్వరలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రంపచోడవరం, పాడేరులలో బ్లడ్ నిల్వచేసే కేంద్రాలు ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైతే 7569982899 నంబర్‌కు సంప్రదించవచ్చనాన్రు. తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంఈవో తాత బ్బాయిదొర, ఎంపీడీఓ బాపన్నదొర, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఈశ్వరరావు, కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ , పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు

రావికమతం: గొంప గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పండగ సందర్భంగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బుధవారం తెలిపారు. ట్రాన్స్ జెండర్లతో నిర్వాహకులైన చంద్రరావు,కంట్రెడ్డి సత్తిబాబు,మట్టా చిరంజీవి.. అశ్లీలంగా నేల డ్యాన్స్‌లు వేయించారని చెప్పారు. గ్రామ దేవతల పండగల్లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గురుకులంలో క్రీడా కుసుమాలు



జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి



బాలుర గురుకుల పాఠశాల మైదానంలో త్రోబాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

- చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- పోటీ ఏదైనా.. ఎక్కడైనా విజేతలు వీరే

నర్సీపట్నం: దృఢ సంకల్పంతో ప్రయత్నించి సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినా పట్టుదలతో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా, జోనల్, రాష్ట్ర క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. తమ పిల్లలను క్రీడాకారులుగా చూడాలన్న తల్లిదండ్రుల ఆశలను, ఉపాధ్యాయుల అకాంక్షలను నెరవేస్తున్నారు. వారే నర్సీపట్నంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలుర గురుకుల విద్యార్థులు. చదువులో రాణించడమే కాదు. క్రీడల్లోనూ తాము చదువుతున్న విద్యాసంస్థ ప్రతిష్ఠ పెంచుతున్నారు.

పోటీ ఏదైనా.. ఎక్కడైనా పతకాలు దక్కించుకోవడంలో గురుకుల విద్యార్థులే ముందుంటున్నారు. కడప, విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్, టెన్నికాయిట్ పోటీలకు వీరు ఎంపికయ్యారు.

క్రీడలతో పాఠశాలకు మంచి గుర్తింపు..



మా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు, గుర్తింపు తీసుకువస్తున్నారు. రోజూ సాయంత్రం క్రీడలకు నిర్దేశించిన సమయం కంటే కొంత సమయం అదనంగా కేటాయిస్తున్నాం. ఆదివారం ఉదయం పది గంటల వరకు విద్యార్థులు స్వేచ్ఛగా ఆడుకునే వెసులుబాటు కల్పించాం. క్రీడల్లో ప్రతిభ చూపే వారు చదువులో మరింత రాణిస్తారు. ఈ గురుకులం ఏటా నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తోంది. క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించే వారిపై మరింత శ్రద్ధ చూపుతాం.

–ఎస్. వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

మెరికల్లా తీర్చిదిద్దుతున్నాం..

గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో చక్కటి పేరు తెచ్చుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా పతకంతోనే తిరిగొస్తారు. పదుల సంఖ్యలో ఉన్న వీరందరికీ శిక్షణ ఇచ్చేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాం. వీరిలో కూడా క్రీడలంటే ఆసక్తి, రాణించాలన్న పట్టుదల ఉంది.

–జి.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు, గురుకుల పాఠశాల

జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



మారు గ్రామంలో పుట్టి పెరిగినా, గురుకుల పాఠశాలలో సీటు రావడంతో సీహెచ్ శ్యామ్ కుమార్ (పదో తరగతి) చదువుతో పాటు క్రీడల్లోను శిక్షణ పొందుతున్నాడు. గత నెల 27, 28 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్–17 విభాగంలో పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని అతను చెబుతున్నాడు.

–సీహెచ్ శ్యామ్‌కుమార్ (పదో తరగతి)

క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలని..



గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఒ. గోవర్ధన్ హ్యాండ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాడు. గత నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలనేది లక్ష్యమని తెలిపాడు.

– గోవర్ధన్

టెన్నికాయిట్‌లో రాణిస్తూ..



ఎనిమిదో తరగతి చదువుతున్న పి.మణికంఠ టెన్నికాయిట్‌లో జిల్లా, జోనల్ స్థాయిలో పతకాలు సాధిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో విశాఖలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. జనవరి 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాడు. జాతీయస్థాయి పోటీల్లో రాణించడమే తన ధ్యేయమని తెలిపాడు.

– పి.మణికంఠ

రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు



గత డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో జరిగిన బేస్‌బాల్ (విభాగం–17)లో జి.నరసింహనాయుడు (తొమ్మిదో తరగతి) ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జనవరి 29,30 తేదీల్లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించాడు. ఆరో తరగతి నుంచి క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు అందిస్తున్న శిక్షణను అందిపుచ్చుకుంటూ జిల్లాస్థాయిలో మంచి ఆట తీరు ప్రదర్శించాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు.

– జి.నరసింహనాయుడు (తొమ్మిదో తరగతి)

బైకుల అందజేతకు దివ్యాంగుల ఎంపిక



దివ్యాంగుల ఎంపిక నిర్వహిస్తున్న వైద్యుడు సుధాకర్

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ సమావేశపు హాలులో బుధవారం అర్థోపెడిక్ దివ్యాంగులకు మోటారు బైక్‌లు ఇచ్చేందుకు అర్హుల గుర్తింపు కార్యక్రమం జరిగింది. వయస్సు ప్రతిపాదికన 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారిని మాత్రమే అర్హులుగా గుర్తించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా దివ్యాంగుల వెల్ఫేర్ డైరెక్టర్ మాధవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆమోదం తీసుకున్నట్టు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు 30 వాహనాలు వచ్చినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉండి 70 శాతం పైబడి వైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 2న ఇంటర్వ్యూలు జరిగాయన్నారు.అయితే రంపచోడవరం నియోజకవర్గం నుంచి రాలేని దివ్యాంగుల కోసం జేసీ శివ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఐటీడీఏలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు. పది రోజుల్లో అర్హుల ఎంపిక జాబితా విడుదల చేస్తామన్నారు. ఎంపికై న దివ్యాంగులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా బైక్‌లు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆర్థోపిడిషియన్ డాక్టర్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ అప్పలనాయుడు, ఎన్‌జీవో కో–ఆర్డినేటర్ సీహెచ్.బాబ్జీ, కౌన్సిలర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్

- విశేషంగా ఆకట్టుకున్న పలు స్టాళ్లు
- ఐఏఎస్‌కు ఎంపికైన మౌర్య భరద్వాజ్‌కు సన్మానం



ఐఏఎస్ అధికారి మౌర్య భరద్వాజ్‌ను సత్కరిస్తున్న అధికారులు

నర్సీపట్నం: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. పాడి పరిశ్రమ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, వెలుగు, గ్రామీణ ఉపాధి హామీ, విద్యా శాఖ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోషకాలతో కూడిన పిండి వంటకాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. జాతీయ స్థాయిలో సివిల్స్ 28వ ర్యాంక్ సాధించి ప్రస్తుతం శిక్షణలో ఉన్న నర్సీపట్నానికి చెందిన మౌర్య భరద్వాజ్‌ను కమ్యూనికేషన్ సహాయ సంచాలకుడు షఫి మహమ్మద్, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ సివిల్స్ ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్టాళ్లు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జ్యోతి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఐలకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో రెవెన్యూశాఖలో భారీగా పదోన్నతులు కల్పించడంతో పాటు బదిలీలు చేశారు. 24 మంది ఎంఆర్ఐలకు సీనియర్ అసిస్టెంట్లు(డిప్యూటీ తహసీల్దార్లు)లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో ఐదుగురికి అల్లూరి జిల్లా నుంచి, మరో ఐదుగురికి విశాఖ జిల్లా నుంచి పదోన్నతి కల్పించి, డిప్యూటీ తహసీల్దార్లుగా నియమించారు. అదే కార్యాలయాల్లో ఎంఆర్ఐ–1, ఎంఆర్ఐ–2గా ఉన్న మరో 9 మందిని ఎంఆర్ఐగా బదిలీలు చేశారు. వీరికి భూ రీ సర్వే ప్రక్రియ కోసం ప్రత్యేకంగా పదోన్నతులు కల్పించడం జరిగింది. ఈమేరకు బుధవారం జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరు వాహనాలపై కేసులు నమోదు

అనకాపల్లిటౌన్: రికార్డులు సక్రమంగా లేని ఆరు వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు అనకాపల్లి రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగరం రహదారిలో బుధవారం వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. వాహనాల యజమానులకు రూ.75 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆటో నంబర్‌తో ఒక వ్యాన్ నడుపుతున్నట్టు గుర్తించామని చెప్పారు. ఆ వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

చింతూరు: మండలంలోని కొత్తూరు వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామన్నపాలెనికి చెందిన సోడె రామయ్య(30) అనే యువకుడు మృతి చెందాడు. రామయ్య భార్య రాజమణి విద్యానగరం ఆశ్రమ పాఠశాలలో వంటమనిషిగా పనిచేస్తోంది. స్వగ్రామమైన రామన్నపాలెం వచ్చిన రామయ్య రాత్రి తిరిగి విద్యానగరం వెళ్తున్న క్రమంలో కొత్తూరు వద్ద ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ క్రమంలో తీవ్రగాయాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు.

భార్య హంతకునికి జీవిత ఖైదు

విశాఖ లీగల్ : జీతం డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో భార్యను అతి దారుణంగా హతమార్చిన భర్తకు యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమాన విధిస్తూ నగరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి గుత్తుల గోపి బుధవారం తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించని పక్షంలో అదనంగా ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు కొర్రా రవి (40) అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి సర్కిల్ అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్మపాడు గ్రామ నివాసి. లక్ష్మి కూడా అదే గ్రామానికి చెందినది. వీరికి 2016లో వివాహం జరిగింది. లక్ష్మి స్థానికంగా అంగన్వాడీ టీచర్‌గా పనిచేసేది. భార్య జీతం డబ్బులు తీసుకుని రవి వ్యసనాలకు బానిసయ్యాడు. ఇలా ఏడాది గడిచిన తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు పెరగడంతో విడిపోవాలనుకున్నారు. ఆ కోపంతో 2017 జూలై 2న లక్ష్మి ఇంటికి రవి వచ్చి ఆమెపై భౌతికంగా దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రశేఖర్ రావు నిందితునిపై కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

16 మంది జూదరుల అరెస్టు

అనకాపల్లిటౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జూదం, కోడిపందాలాడుతున్న వారిపై దాడులు నిర్వహించినట్టు ఎస్పీ గౌతమి సాలి బుధవారం తెలిపారు. ఆరు కేసులు నమోదు చేసి, 16 మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల నుంచి రూ.5,400 నగదు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.